



# వెన్నులో కత్తి పోటు

ఆ రోజు ఫిబ్రవరి ఒకటో తారీఖు. అర్ధరాత్రి పన్నెండు కావస్తోంది. కారు ప్రమాదంలో దెబ్బలు తిన్న కుర్రాడి ప్రాణం కాపాడడం కోసం ఎడతెరిపి లేకుండా యమధర్మరాజు దూతలతో కుస్తీ పట్టి పట్టి పూర్తిగా అలసిపోయిన డాక్టర్ సుధాకర్ ఆసుపత్రి ఆవరణ దాటి, డాక్టర్లు పడుకోడానికి ప్రత్యేకంగా ఆమర్చిన బంగాళా వేపు కాళ్లీడుచుకుంటూ నడుస్తున్నాడు. ఉదయం తొమ్మిది గంటలకి ఇంత తిన్నాడంతే. ఈ అర్ధ రాత్రి వేళప్పుడు ఇంక ఏమిటి తింటాడు? చావు బతుకుల్లో ఉన్న కుర్రాడి ప్రాణం నిలచిందన్న సంతృప్తి తోటే కడుపు నిండి పోయింది.

మొన్నిమధ్యే మెర్సీ ఆసుపత్రి ఎమర్జెన్సీ విభాగానికి ప్రారంభోత్సవం చేసేరు. ఈ కారు ప్రమాదం మూడు నెలల కిందట జరిగుంటే కుర్రాడు నిష్కారణంగా హరీమని పోయేవాడు. ఆశ్చర్యం కాకపోతే ఏమిటి? ఉదయం రద్దీలో శాన్ డియాగో ఫ్రీవే మీద పెద్ద ప్రమాదం జరిగింది. కారు పచ్చడి అయిపోయింది. పోలీసులు, పెరామెడిక్కులు ఉక్కు కుప్పలో చిక్కుకున్న కుర్రాడిని 'ప్రాణదంష్ట్రలు' ఉపయోగించి విడిపించేరు. వెనువెంటనే మెర్సీ ఆసుపత్రికి రేడియోలో వార్తని తెలియబరచి, హెలికాప్టరు మీద కొన ఊపిరితో చావు బతుకుల మధ్య ఊగిసలాడుతూన్న క్షతగాత్రుడిని తీసుకొచ్చి ఆసుపత్రి ప్రాంగణంలో మరొక పది నిమిషాలలో దింపేరు. అదే వేళకి డాక్టర్ సుధాకర్ జట్టు చేతులు రుద్దుకొని, పరికరాలు సర్దుకొని తయారుగా ఉంది. విరిగిన ఎముకలని సరిదిద్ది, చిరిగిన గాయాలని కుట్టి, పోతూన్న ప్రాణాలని నిలబెట్టే సరికి అర్ధరాత్రి అయిపోయింది. "ఈ ట్రామా వార్డు ఇంకా ఎంతమంది ప్రాణాలని కాపాడుతుందో?" అనుకుంటూ సుధాకర్ బంగళాలో ప్రవేశించి మంచం మీద నడ్డి వాల్చేడు.

'బలమయిన గాయాలు' అనే అర్ధం స్ఫురించ వలసి వచ్చినప్పుడు ఇంగ్లీషులో 'ట్రామా' అనే మాటని వాడతారు. కారు ప్రమాదాలు, రైలు ప్రమాదాలు, విమాన ప్రమాదాలు, కత్తి పోట్లు, తుపాకి కాల్పులు, దొమ్మిలు వగైరా సందర్భాలలో బలంగా తగిలిన దెబ్బలే శారీరక ట్రామా అంటే. ఇలా ట్రామాలో ఉన్నవారికి ఎంత త్వరగా వైద్యం అందించగలిగితే అంత మంచిది. అందుకని కొన్ని కొన్ని పెద్ద పెద్ద నగరాలలోని ఆసుపత్రులలో క్షతగాత్రుల సంరక్షణకని ట్రామా విభాగాలని ఈ మధ్యనే కొత్తగా మొదలు పెడుతున్నారు. ఎమర్జెన్సీ వార్డు అంటే ఒక గది లాంటి వసతి మాత్రమే. ట్రామా విభాగం అంటే ఎమర్జెన్సీ వార్డు లాంటి గదితో పాటు అంబులెన్సులు, హెలికాప్టర్లు, రేడియోలు, సంరక్షక దళాలు, నర్సులు, పెరామెడిక్కులు, వగైరా పటాటోపం అంతా ఉంటుంది.

"ఈ ట్రామా వార్డు ఇంకా ఎంతమంది ప్రాణాలని కాపాడుతుందో?" అని తను స్వగతంగా వేసికొన్న ప్రశ్నకి ఇంత త్వరగా సమాధానం దొరుకుతుందని సుధాకర్ కలలో

కూడ అనుకో లేదు. అలసటతో ఉన్న సుధాకర్ కళ్లు కొంచెం మగత మగతగా మూతలు పడుతున్నాయి.

అదే సమయంలో శాన్ డియాగో నగరంలో మరొక మూల. రబ్బరు బొమ్మలు తయారు చేసే కర్మాగారంలో రాత్రి పనంతా పూర్తి చేసికొని పీటర్ ఇంటికి చేరుకున్నాడు. కారు ఇంటికి కొంచెం దూరంగా పార్కు చేసుకొని ఇంటి చేరువకి వచ్చేసరికి గుమ్మం దగ్గర మూడు నీడలు తచ్చాడుతూ కనిపించేయి. ఎవరా అని అనుమాన పడుతూనే, ఎందుకేనా మంచిదని తన ఉనికిని తెలియబరచడానికా అన్నట్లు ఒక దగ్గు దగ్గేడు. చీకట్లో నీడలు కదల లేదు. 'ఎవరక్కడ?' అని కొంచెం బెదురుతూనే అరిచేడు. వాళ్లు పారిపోలేదు సరికదా, పీటర్ మీదకి లంఘించి వెన్నులో కత్తితో పొడిచి పారిపోయారు.

ఒక్క క్షణం పాటు వాళ్లు వీపు మీద గుద్దు గుద్దేరనుకున్నాడు పీటర్. ఉత్తర క్షణంలోనే చొక్కా అంతా రక్తసిక్తం అయిపోయింది. పీటర్ ఎలాగో కాలు నిలదొక్కుకుని, తలుపు తాళం తీసి లోపలికి అడుగు పెడుతూనే

''అమ్మా, నన్నెవరో పొడిచేసేరు'' అని అరుస్తూ, అలా అక్కడే కుప్పలా కూలబడి పోయేడు.

కొడుకు రాక కోసం నిరీక్షిస్తూ టెలివిషన్ చూస్తూన్న మేరీ ఆ ఆర్తనాదం విని, పరిగెత్తుకుని వచ్చి, రక్తపు మడుగులో ఉన్న కొడుకుని చూసి, ఒక్క ఉదుటున టెలిఫోన్ ఎత్తి, 911 నంబరు డయల్ చేసింది. కొడుకుని ఎవరో పొడిచేసేరని చెప్పి, ఇంటి చిరునామా చెప్పింది.

అప్పటికే పీటర్ ముఖం అంతా చెమట పట్టేసింది. నుదిటి మీద చెయ్యి వేసి చూస్తే చల్లగా తగిలింది. మేరీ కొడుకు ముఖాన్ని తువ్వాలుతో తుడిచింది. రక్తం కారుతూన్న చోట మరొక తువ్వాలుని వేసి ప్రవాహం ఆపడానికి ప్రయత్నించింది. నిమిషాలు యుగాలుగా గడుస్తున్నాయి. అప్పటికే గీసేసిన కంద గడ్డలా ఉండవలసిన శరీరం పాలిపోయి, ధూసర వర్ణంలోకి మారిపోతోంది.

ఈ లోగా సైరన్ ఊదుకుంటూ వచ్చి, కీచుమని శబ్దం చేస్తూ, గుమ్మంలో పోలీసు కారు ఆగింది. దాని వెనకాతలే అంబులెన్సు, దాని వెనకాతలే అగ్నిమాపక దళం వారి ట్రక్కు ఆగేయి. ఎప్పుడేది అవసరం వస్తుందో ముందే తెలియదు కనుక అంతా వచ్చేరు. అంబులెన్సు లోని పెరామెడిక్కులు, స్టీవు, జిమ్ము పరిగెత్తుకుని లోపలికి వచ్చేరు. పీటర్‌ని పరీక్షించడం మొదలు పెట్టేరు. ఊపిరి కోసం ఎగబాకుతూన్న పీటర్ ముఖం లోకి అప్పటికే చావు కళ వచ్చేసింది.

క్షతగాత్రుడి పేరు కనుక్కుని, ''పీటర్, మరేమీ ప్రమాదం లేదు'' అని మగత లోకి జారిపోతూన్న పీటర్‌కి ధైర్యం చెప్పి, ఇంకా రక్తం నష్ట పోతే షాకు లోనికి జారి పోతాడేమోనన్న భయంతో, ఒత్తిడి కలిగించే కవచం లాంటి దుస్తులతో శరీరాన్ని చుట్టబెట్టి, నిమిషాలమీద పీటర్‌ని అంబులెన్సులోకి ఎక్కించేరు పెరామెడిక్కులిద్దరూ.

జిమ్మీ కారుని తోలుతూ ఉంటే, స్టీవు రేడియో టెలిఫోను తీసుకొని ఆరు నిమిషాలలో అంబులెన్సు మెర్సీ ఆసుపత్రికి చేరుకోబోతూందనే అంచనా వార్తని అందజేసేడు. అర్ధరాత్రి, ఆ నిశీధిలో, అంబులెన్సు బాణాన్ని విడిచిన అమ్ములా దూసుకు పోతూ ఉంటే, పేషెంటు పరిస్తితిని రేడియో ద్వారా పంపించడం మొదలు పెట్టేడు, స్టీవు.

''కోడ్ ట్రామా! కోడ్ ట్రామా!!'' అని ఆసుపత్రి వరండాలు ప్రతిధ్వనించేలా లవుడ్ స్పీకర్ చెబుతోంది. అదే వార్త ఆసుపత్రి ప్రాంగణాలలోను, పరిసరాలలోను ఉన్న పద్దెనిమిది మంది నిపుణులకి బీపర్ ద్వారా అందజేయడం జరిగింది. మూడు నిమిషాలు తిరిగేసరికి, డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లు వగయిరాలంతా ట్రామా వార్డు లోని ఊపిరిపోత గదిలో సమావేశం అయేరు.

రేడియో గదిలోంచి ఆర్చీ జాన్సన్ రేడియో ద్వారా వస్తూన్న వార్తలని ఒక పక్క నుండి వింటూ, మరొక పక్క నుండి మైక్రొఫోన్‌లో పేషెంటు పరిస్థితి చెబుతూ ఉంటే లవుడ్ స్పీకర్ మీద ట్రామా వార్డులో అందరికీ వినిపిస్తోంది.

''పేషెంటు ... కుర్రాడు. దరిదాపు పాతికేళ్లు. కత్తిపోటు...ఛాతీలో...ఎడం పక్కన. విస్తారంగా రక్తస్రావం...నాడి అందడం లేదుట...కళ్లు తేలవేసేడుట...''

పూర్తిగా స్పృహ తప్పిపోయే లోగా అంబులెన్సులో ఉన్న నర్సులు పీటర్ గొంతుక లోనికీ, అక్కడ నుండి శ్వాస నాళం లోనికీ ఒక రబ్బరు గొట్టాన్ని దింపి దాని ద్వారా ఉఛ్వాస నిశ్వాసాలకి ఒక దారి కల్పించేరు. ఇప్పటికే చాల రక్తం పోయిందేమో, ఉన్న కాస్త రక్తం మెదడుకి సరఫరా కాకపోతే మెదడు దెబ్బ తింటుందని ఇందాకా ఇంటి దగ్గర తొడిగిన ఒత్తిడి కవచాన్ని మరికొంచెం బిగించేరు. సూది మందులని సూటిగా రక్తంలోనికి పంపేందుకని చేతులలోని సిరల లోనికి సూదిని ఎక్కించడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలం అయిపోయాయి. రక్తం ప్రవహిస్తూ ఉంటే సిరలు ఉబ్బి ఉంటాయి. అప్పుడు సూది సులభంగా దిగుతుంది. సిరలన్నీ అప్పడాల్లా అణిగిపోయి ఉంటే నర్సు మాత్రం ఏమి చెయ్య గలదు? ఆది లోనే హంసపాదులా, పేషెంటుని ఆసుపత్రికి తీసికెళ్లే లోగానే ప్రాణం పోతే ఎలా? అందుకని పక్కనున్న పెద్ద పెరామెడిక్కు కలుగజేసుకుని సూదిని మెడలో ఉన్న పెద్ద గొట్టం లాంటి గళసిర లోనికి పొడిచేడు. సూది రక్తనాళం లోనికి దిగగానే వెనువెంటనే పిచికారీ యొక్క గొట్టం లోనికి రక్తం చిమ్ముకు రావాలి. కాని సిరెంజి లోనికి ఒక్క చుక్క రక్తం కూడా రాలేదు. చచ్చిన శరీరాన్ని ఆసుపత్రికి తీసుకెళుతున్నారా?

స్పందించడం మానేసిన గుండెకాయని తిరిగి స్పందిపజేసే పద్ధతిని ఇంగ్లీషులో 'సి.పీ.ఆర్.' అంటారు.

కారులో తను ఏమిటి చేస్తున్నాడో ఆసుపత్రిలో ఉన్న వైద్య బృందానికి తెలియజేయడానికి స్టీవు ''సి.పీ.ఆర్. మొదలు పెడుతున్నాం'' అని మైకులో అరుస్తూ, చచ్చిన శరీరంలో ప్రాణం పొయ్యడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు.

స్టీవు పరుగులెడుతూన్న అంబులెన్సులోని మైకులో అరచిన 'సీ.పీ.ఆర్.' అన్న మాటలు ఆసుపత్రి ప్రాంగణం అంతా ప్రతిధ్వనించేయి.

మగత మగతగా ఉన్న సుధాకర్ నిద్ర పోదామనుకున్న ఆశకి స్వస్తి చెప్పి, ఆసుపత్రి ప్రాంగణంలోకి పరుగు పరుగున వస్తూ, 'సీ.పీ.ఆర్.' అన్న మాటలు విన్నాడు. వీధి బట్టలు మార్చుకుందికి కూడా వ్యవధి లేదు. ఒక్క ఉదుటున చేతులు సబ్బుతో కడుక్కుంటూ ఉంటే ఆయనకి సహాయం చేసే నర్సు ''సర్జరీ లోనికి తీసికెళ్లడానికి కాలం సరిపోదు. ఇక్కడికిక్కడే 'థొరకోటమీ' కి సన్నాహాలు చేస్తున్నాం'' అని డాక్టర్ సుధాకర్‌కి వినిపించేలా అరచింది. 'థొరకోటమీ' అన్న ఇంగ్లీషు మాటని పోలిన సంస్కృతం మాట 'హృదయ విదారితం.' అదే పచ్చి పదహారణాల తెలుగులో చెప్పాలంటే, 'గుండెని చీల్చడం.'

''ట్రామా వార్డు పెరటి గుమ్మంలోకి వచ్చేసేం'' అని స్టీవు రేడియోలో చెప్పడమేమిటి, అరడజను మంది నర్సులు, సహాయకులు బయటకి పరుగెత్తుకుని వెళ్లడమేమిటి, పీటర్ శరీరాన్ని లోపలికి తీసుకు రావడమేమిటి, అంతా మెరుపులా జరిగి పోయింది.

పీటర్ శరీరాన్ని ఎత్తి బల్లమీద పడుకోబెడుతూ ఉంటే పెద్ద నర్సు ''ఈ కేసు ఇక లాభం లేదు'' అని పెదవి విరిచేసింది. ఆ మాటని ఏ మాత్రం పట్టించుకోకుండా మత్తు మందు ఇచ్చే వైద్యుడు, శ్వాస నాళం ఎలా ఉందోనని పరీక్ష ప్రారంభించేడు. మరో ఇద్దరు వైద్యులు చేతి మణికట్లు దగ్గర, కాలి మడమల దగ్గర చిన్న చిన్న కంతలు పెట్టి, అప్పడాలలా అణిగి పోయి ఉన్న సిరలు ఎక్కడ ఉన్నాయో పసి కట్టి, వాటిల్లోకి రక్తం ఎక్కించడానికి కావలసిన సదుపాయాలు చేస్తున్నారు. సేలీను సీసాలు పట్టుకుని మరొక ఇద్దరు నర్సులు తయారుగా ఉన్నారు. మరొక నర్సు సార్వజనిక ధాతృత్వ (యూనివర్శల్ డోనర్) జాతికి చెందిన రక్తం తయారుగా పట్టుకుని ఉంది.

ఈ ప్రయత్నాలు ఇలా జరుగుతూ ఉండగానే పెద్ద నర్సు ఏంటీ సెప్టిక్ ద్రావణంలో ముంచిన స్పంజితో పీటర్ ఛాతీని ఇటునుండి అటు తుడుస్తూ ఉంటే, సుధాకర్ మత్తుమందు ఇచ్చే వైద్యుడి కనుసైగ కోసం ఎదురు చూస్తూ చేతికి రబ్బరు తొడుగులు వేసికొని, ''స్కాల్‌పెల్'' అని హుకుం జారీ చేసేడు.

నర్సు అందించిన కత్తితో స్టీవు ఛాతీ మీద అడ్డుగా ఇటునుండి అటుకి ఒక కోత కోసేడు డాక్టర్ సుధాకర్. ఈ కోతనే ఇగ్లీషులో 'లేటరల్ ఇన్సిషన్' అంటారు. ఈ కోతకి జవాబుగా కత్తిపోటు కారణంగా హృదయ కుహరంలోనికి స్రవించి పేరుకుంటూన్న రక్తం ఒక ముద్దలా నేలమీద పడింది. చేతిని లోపలికి పోనిచ్చి మరికొంత రక్తాన్ని బయటకి తోడేడు సుధాకర్.

తర్వాత చిల్లు పడి అణగారిన ఊపిరితిత్తి పక్కనుండి చేతిని పోనిచ్చి, గుండెకాయ చుట్టూ ఉండే పొరని నెమ్మదిగా చీల్చి, అప్పటికే రక్తపులేమి వల్ల ముకుళించుకు పోయి

స్పందన లేకుండా ఆగిపోయిన గుండెకాయని చేత్తో పట్టుకుని నెమ్మదిగా పిసకడం మొదలు పెట్టేడు. ఆ మాంసపు ముద్దలో చైతన్యం లేదు.

"ఈ గుండెకాయలో రక్తం లేదు. అంతా ఖాళీ. ఇంక ఇది ఎలా కొట్టుకుంటుంది?" అని తనలో తనే గొణుగుకుంటూ, "చిన్న కుర్రాడు. అనుభవించవలసిన రోజులన్నీ ఇంకా ముందే ఉన్నాయి. ఈ కుర్రాడు చావడానికి వీలు లేదు," అని మనస్సులోనే అనుకుంటూ గుండెలో చలనం కోసం విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు.

శాన్ డియాగో నగరానికి ట్రామా వార్డు తెచ్చిన ఘటికుడు డాక్టర్ రిచ్చర్డ్ వర్జిలియో. ఆయన, ఆయన అనునాయులు వియత్‌నామ్ యుద్ధంలో దెబ్బలు తగిలిన సిపాయిలని వందలకొద్దీ మృత్యువు వాత నుండి రక్షించ గలిగారంటే దానికి ముఖ్య కారణం అన్ని హంగులు ఉన్న మిలటరీ బీడాసుపత్రి వారికి అందుబాటులో ఉండడమే. దెబ్బ తగలడమేమిటి, క్షతగాత్రులని క్షణాల మీద హెలికాప్టరులో ఆసుపత్రికి తీసుకు రావడమేమిటి, వాళ్లకి మిలటరీ పద్ధతిలో నర్సులు, డాక్టర్లు సంరక్షణ చెయ్యడ మేమిటి. అన్ని వనరులు, అంత క్రమశిక్షణ ఉండబట్టి మృత్యువు కోరల్లోంచి ఎంతమందినో బయటకు లాగ గలిగేరు.

యుద్ధం నుండి తిరిగి వచ్చిన తర్వాత బల్బోవా నేవీ ఆసుపత్రిలో పనిచేస్తూ, అప్పుడప్పుడు తీరుబడి చేసికొని, శాన్ డియాగోలో ఉన్న ప్రయివేటు ఆసుపత్రులలోని ఎమర్జెన్సీ వార్డులలో పనిచేసి, వేన్నీళ్లకి చన్నీళ్లలా ఉంటాయని నాలుగు రాళ్లు గణించుకునే వాడు – డాక్టర్ వర్జిలియో. ఆ సందర్భంలో ఎన్నో సార్లు చూసేడాయన. అంబులెన్సు క్షతగాత్రులని తీసుకొని రావడం. అవసరానికి అదనంగా కావలసిన రక్తం అసుపత్రిలో వేళకి ఉండక పోవడం. రక్తపు బేంకుకి టేక్సీని పంపించి కావలసిన రక్తం తెప్పించ గలిగినా, కావలసిన నైపుణ్యం ఉన్న వైద్యుడు వేళకి డ్యూటీలో ఉండక పోవడం. ఇలా అడుగడుక్కీ అర లక్ష అవాంతరాలు వచ్చి పడుతూ ఉంటే పోయే ప్రాణం మీన మేషాలు లెక్క పెడుతూ మంచి ముహూర్తం కోసం కూర్చుంటుందా?

ఒక సారి ఏమయిందంటే పన్నెండేళ్ల కుర్రాడికి పొట్ట మీద దెబ్బ తగిలి లోపల వృక్కకము చితికి పోయింది. కుర్రాడిని అంబులెన్సులో మెర్సీ ఆసుపత్రికి తీసుకొచ్చేరు. కావలసిన డాక్టర్లని, నర్సులని, మిగిలిన సిబ్బందినీ సమకూర్చుకొనేసరికి పుణ్యకాలం కాస్తా నిండి పోయింది. కుర్రాడు కాస్తా చెయ్యి జారిపోయేడు.

"మేము చెయ్య గలిగిందంతా చేసేం. ఆ భగవంతుని సాయం కూడ సమకూరక పోతే మానవ మాత్రులం మనం ఏమిటి చెయ్యగలం?" అని వేదాంత ధోరణిలో శోకిస్తూన్న తల్లిని ఓదార్చడానికి ప్రయత్నించేడు, డాక్టర్ వర్జిలియో. కాని చెయ్య గలిగిందంతా చెయ్య లేదని అతని అంతరాత్మ ఘోషించింది. "ఇదే వియత్‌నామ్ అయితే ఇలా జరిగుండేది కాదు కదా" అని ఆయన ఎన్ని పర్యాయాలో అనుకున్నాడు.

అటువంటి ఉద్రేకంలో ఉత్తనే అలా అనేసుకుని ఊరుకుండిపోతే అది శ్మశాన వైరాగ్యమే అవుతుంది. కార్యశూరుడు కనుక ఆచరణలో పెట్టడానికి ఆయన పథకం ఒకటి వేసేడు. ప్రజలని, ఊళ్లో పెత్తనం వెలగబెట్టే పెద్దలని కొంతమందిని పట్టేడు. దొరికిన వాళ్లకి కాకా పట్టేడు. ఊళ్లో ఉన్న వివిధ అసుపత్రులలో ఉన్న వనరులని సమష్టిగా వాడుకుంటే క్షతగాత్రులకి కావలసిన సదుపాయాలు చెయ్యడం కష్టం కాదని పోరాడేడు. ఏకైక లక్ష్యంతో, చిత్త శుద్ధితో, అహోరాత్రాలు ఇలా నాలుగేళ్లు పోరాటం జరపగా, ఇతని బెడద వదలుగొట్టు కుందుకో ఏమో, ప్రభుత్వం ఒక కమీషను నియమించింది. ఆ కమిషన్ వారి సిఫారుసుప్రకారం ఆ జిల్లాలో ఉన్న ఆసుపత్రులలో ముప్ఫయ్యింటిని ట్రామా ఆసుపత్రులుగా ప్రవచించేరు. అంటే, ఈ ఆసుపత్రులలో సమష్టిగా ట్రామా ట్రీట్‌మెంటుకి కావలసిన సదుపాయాలు సమకూర్చేరు. ఆయా ప్రాంతాలలో ఉన్న సర్జన్‌లలో ఉన్న ప్రకాండులని ఎంపిక చేసి, ఆసుపత్రి ఒక్కంటికి ముప్ఫయి మందిని చొప్పున కేటాయించేరు. వారిలో వారు వాటాలు వేసుకొని, ఎవరో ఒకరు ఇరవై నాలుగు గంటలూ ఆసుపత్రి ప్రాంగణంలో లభ్యమయేటట్టు ఒప్పందం చేసుకున్నారు. దెబ్బలు తగిలిన వాళ్లని తీసుకు రావడానికి కార్లు, హెలికాప్టర్లు, మొదలయిన వాహనాలు, ఆ వాహనంలోనే ప్రథమ చికిత్స చెయ్యడానికి సదుపాయాలు, ఆ వాహనాలు కదలికలో ఉన్నా సరే ఆసుపత్రులతో సంభాషణలు జరపడానికి నిస్తంతీ వార్తావాహక పరికరాలు, ఇలా చాల బందోబస్తుగా ఎన్నో ఏర్పాట్లు చేసేరు. యమ భటులు వచ్చే లోగా ప్రాణ భటులు ప్రమాదం జరిగిన ప్రదేశానికి చేరుకోవాలన్నది వారి లక్ష్యం.

ఈ ఏర్పాట్లలోనూ, ఒప్పందాలలోనూ పాత్రధారుడైన డాక్టర్ సుధాకర్ ఆ రోజు, ఆ నిశి రాత్రి, రక్తసిక్తమైన చేతులతో పీటర్‌కి ప్రాణం పోసే ప్రయత్నంలో అతని హృదయ కుహరంలో చెయ్యి పెట్టి, మారాం చేస్తూన్న గుండెకాయని కొట్టుకోమని బుజ్జగిస్తున్నాడు. చుట్టూ ఉన్న సిబ్బంది అంతా ఉత్కంఠతో నిశ్శబ్దంగా ఎవరి పనులు వారు చెయ్యడంలో నిమగ్నులయి ఉండడం వల్ల కాబోలు, పీటర్ ఊపిరితిత్తుల లోనికి గాలి కొడుతూన్న యంత్రం చేసే చప్పుడు వింతగా వినిపిస్తోంది. ఇంతలో సుధాకర్ వేలి దగ్గర హృదయ కవాటపు కండరం చిన్నగా భ్రమించిందా అన్న భ్రమ కలగడంతో ``ఏదో కదులుతోంది'' అని ఆయన అనడం, అంతలోనే అప్పచ్చిలా అణుచుకు పోయిన గుండె రక్తంతో నిండడం, వెను వెంటనే బుడుక్కు, బుడుక్కు మని గుండె కొట్టుకోవడం మొదలయాయి. ``నెగ్గేమురా బాబూ'' అన్నట్లు సుధాకర్ కళ్లు మిగిలిన సిబ్బంది కళ్లని కలుసుకున్నాయి.

గుండె స్పందించడం మొదలు కాగానే రక్త ప్రసరణ కూడ మొదలయింది. గుండె ముకుళించుకున్నప్పుడల్లా ధమనులలోకి వెళ్లే రక్తం వీపులో ఉన్న కత్తిపోటు బెజ్జం లోనుండి బుస్ బుస్ మంటూ బయటకు వచ్చేస్తోంది. డాక్టర్ సుధాకర్‌కి సహాయం చేస్తూన్న విద్యార్థి వైద్యుడు గబగబా ఊపిరితిత్తిని పక్కకి ఒత్తిగిల్లింపించి పట్టుకున్నాడు. పిసుకుతూన్న గుండెకాయని దాని యథాస్థానంలోకి వెళ్లేలా జార విడిచేడు సుధాకర్. అప్పుడు కనిపించింది

– గుండెకాయ కుడి జఠరిక మీద అంగుళం పొడుగు కత్తి వేటు. ఆ గాయాన్ని తన చూపుడు వేలితో మూసి, గుండె కండరాన్ని నెమ్మదిగా పది నిమిషాల పాటు తన వేళ్లతో దువ్వి, రక్త ప్రసరణ అవయవాలన్నిటికి అందుతోందన్న విషయం నిర్ధారణ చేసుకొని, అప్పుడు ఆ వేలిని ఆలాగే ఉండనిచ్చి, ఆ అంగుళం పొడుగు గాయానికి నాలుగు కుట్లు వేసి అతికేడు డాక్టర్ సుధాకర్. చెయ్య వలసిన పని ఇంకా చాల ఉంది కనుక ఛాతీ మీద తను కోసిన కోతని పూర్తిగా మూసెయ్యకుండా కొక్కేలు తగిలించి ఉంచేడు.

అప్పటికి పీటర్ ఆసుపత్రి ప్రాంగణంలో ప్రవేశించి అరగంట దాటుతోంది. ప్రాణం నిలబడింది కనుక ఎమర్జెన్సీ గదిలోంచి మేడ మీదనున్న పెద్ద ఆపరేషన్ గదిలోకి బదిలీ చేసే ఏర్పాట్లు చకచక జరుగుతున్నాయి. ఈ అర్ధ గంట లోనూ గుండె కాయ మీద శస్త్రచికిత్స చెయ్యడంలో ప్రావీణ్యత ఉన్న మరొక పెద్ద డాక్టర్ని పిలిపించడం జరిగింది. ఆయన మేడ మీద సబ్బుతో చేతులు రుద్దుకునే తతంగంలో ఉన్నాడు. మిగిలిన మరమ్మత్తులు చెయ్య వలసిన భాధ్యత ఆయనది. ప్రధమ చికిత్స చేసి పేషెంటు చచ్చిపోకుండా కాపాడే వరకే ఎమర్జెన్సీ వార్డు వారి బాధ్యత.

డాక్టర్ సుధాకర్ చెయ్యవలసిన పని అయిపోయింది. చేతులు కడుక్కొని, బయటకు వచ్చేసరికి పీటర్ తల్లి తన ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని, దేవుణ్ణి ప్రార్థిస్తూ కనబడింది. సుధాకర్ ఆవిడ పక్కకి చేరి పీటర్ బతికే ఉన్నాడనీ, పెద్ద గండం గడచిందనీ, పరిస్థితి మాత్రం ఇంకా అపాయకరంగానే ఉందనీ, పెద్ద డాక్టరు బాగా అనుభవం ఉన్నవాడనీ చెప్పి ఊరడించేడు.

పీటర్ ఇంకా గట్టెక్క లేదని సుధాకర్‌కి తెలుసు. గుండె కొట్టుకోగానే సరిపోయిందా? మిగిలిన అవయవాల ఆరోగ్యం ఎలా ఉంటుందో!

ఇంక ఈ రాత్రికి ఎలాగూ నిద్ర పోయే యోగం లేదని సుధాకర్‌కి తెలుసు. అపరాత్రి వేళ, రెండు గంటలకి తిండేమిటని మీమాంశ లేకుండా నర్సు అందించిన రొట్టె ముక్క తిని, ఇన్ని పాలు తాగి అలాగే అక్కడ కుర్చీలో కూలబడి చిన్న కునుకు తీసేడు. మేడ మీద సర్జరీ పూర్తవగానే పీటర్‌ని చూడడానికి సుధాకర్ వెళ్లేడు. ఆ రాత్రల్లా నిమిషానికో గండం. రక్త ప్రసరణ సజావుగా సాగడం మొదలయిన తర్వాత మూత్రపిండాలు, కాలేయం నెమ్మదిగా తమ తమ పనులు తిరిగి చెయ్యడం మొదలు పెట్టేయి. కాని హృదయ స్పందన మాత్రం లబ్ డబ్ అంటూ ఉండడానికి బదులు అప్పుడప్పుడు బుడబుడక్కల వాడి ఢమరుకంలా దబదబ కొట్టుకొనడం మొదలు పెట్టింది. ఈ రకం ప్రవర్తనని మందులు వాడి అదుపులో పెట్టేరు. మరొక సారి పీటర్ ఒళ్లంతా చల్లబడి పోయింది. ఒళ్లంతా దుప్పట్లు కప్పి, వెచ్చబెట్టిన రక్తాన్ని ఎక్కించి, ఎలాగో ఈ గండాన్ని కూడ గట్టెక్కించేరు. ఈ పితూరీల కారణంగా ఆ రాత్రంతా సుధాకర్ జాగరమే చేసేడు.

తెల్లారగానే పీటర్‌ని మరొక వైద్యుడికి అప్పగించి, బంగళాకి వచ్చి చిన్న కునుకు తీసేడు సుధాకర్.

మధ్యాహ్నం తల్లిని తీసికెళ్లి ఇంకా మగతలో ఉన్న కొడుకుని చూపించేడు డాక్టర్ సుధాకర్. పీటర్ చేతులు పట్టుకుని తనని ఒకసారి పలకరించమని ప్రాధేయపడింది, మేరీ. ఫలితం శూన్యం.

మూడో రోజు తల్లిని చూసి, "అమ్మా, నాకు ఏమయిందమ్మా?" అని అడిగేడు పీటర్.

మార్చి ఏడో తారీఖున పీటర్ ఇంటికి వెళ్లేడు. సెప్టెంబరు వచ్చేసరికి కారు తోలుకుంటూ కులాసాగా తిరగడం మొదలు పెట్టేడు. డిసెంబరు నాటికి మళ్లా రబ్బరు బొమ్మల కార్ఖానాలో ఎప్పటిలాగే పని చెయ్యడం మొదలు పెట్టేడు పీటర్.

క్రిస్‌మస్ ముందు రోజు ఒక చిన్న పెట్టి చుట్టూ రంగు కాగితం చుట్టబెట్టి, దాని చుట్టూ ఒక రంగు రిబ్బను కట్టి, ఆ పెట్టెని సుధాకర్ ఆఫీసుకి పట్టుకొచ్చి బల్లమీద పెట్టేడు పీటర్. బహుమానాలేవీ పేషెంట్ల దగ్గర పుచ్చుకో కూడదని ఆ ఆసుపత్రిలో ఒక నియమము, నిబంధన ఉన్నాయి. అందుకని

"మా ధర్మం మేము నిర్వర్తించేము. దీనికి బహుమానాలేవీ పుచ్చుకో కూడదు" అని మందలింపు ధ్వనించేలా చెప్పేడు సుధాకర్.

"విప్పి చూడండి" పీటర్ బలవంతం చేసేడు.

సుధాకర్ విప్పి చూసేడు. లోపల ఎర్రటి గుండెకాయ ఉంది, రబ్బరుతో చేసినది. ఆ గుండెకాయ నమూనా యొక్క కుడి జఠరిక మీద అంగుళం మేర గాయం పడ్డట్టు ఒక మచ్చ ఉంది.

"మీకు, మీ సిబ్బందికి, ఈ ఆసుపత్రికి ఎంతో ఋణపడి ఉన్నాను. మీ కోసం ప్రత్యేకం మా కర్మాగారంలో నేనే స్వయంగా చేసేను. హృదయపూర్వకంగా సమర్పించుకుంటున్నాను." అన్నాడు పీటర్ నవ్వుతూ.

ఇంత చిన్న బహుమానం పుచ్చుకొనడంలో తప్పేమీ కనబడలేదు, సుధాకర్‌కి. కాని పీటర్ ప్రభృతులకి ఎందరికో ప్రాణ భిక్ష పెట్టినది తను కాదనీ, డాక్టర్ రిచర్డ్ వర్జిలియో యొక్క చిత్తశుద్ధి, అకుంఠిత దీక్ష అనీ సుధాకర్‌కి తెలుసు. ఆయన ప్రోద్బలంతో మెర్సీ ఆసుపత్రిలో ట్రామా విభాగం కట్టి ఉండకపోతే పీటర్ బతికి ఉండే వాడు కాదు. అయినా చేతికి చిక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందామని సుధాకర్ అన్నాడు.

"పీటర్, ఈ చిన్న బహుమానం మా ఆసుపత్రి తరఫున పుచ్చుకుందికి నాకు అభ్యంతరం ఏమీ లేదు. కాని ఇటువంటి చిన్న బహుమానంతో నువ్వు మా ఋణం తీర్చ లేవు. కావలిస్తే ఈ ఋణ విముక్తికి ఒక చిటకా చెబుతాను, గుర్తుంచుకో. నీ అవసరం ఇంకా ఏదో ఈ ప్రపంచానికి ఉండబట్టే నువ్వు మృత్యుముఖం నుండి బయట పడ్డావు. నీ వల్ల జరగవలసిన

ప్రయోజనం ఏదో ఇంకా ఉంది. నీ మాటలలోనే చెప్పాలంటే, నువ్వు ఈ ప్రపంచానికి రుణపడి ఉన్నావు. కనుక నీ జీవితం సద్వినియోగం చేసుకో. మరొక జీవిని రక్షించ గలిగే సదవకాశం నీకు దక్కినప్పుడు మాత్రం ఆ అవకాశాన్ని వదులుకోకు. అప్పుడే నీ రుణం తీరుతుంది.''

''బొమ్మల వ్యాపారంలో ఉన్న నేను మరొకరికి ప్రాణం ఎక్కడ పొయ్యగలను, సార్. భలే వారే!''

''నువ్వే ప్రాణం పొయ్యక్కర లేదు. ప్రాణాలు పోసే సదుపాయాలు అమర్చాలనే దీక్షతో కార్యశూరులు ఎవరేనా, ఎప్పుడేనా వచ్చి సహాయం అర్థిస్తే మాత్రం మొండి చెయ్యి చూపించకు. అప్పుడే నీ రుణం తీరుతుంది. నీకు ఎవరయితే సహాయం చేసేరో వాళ్లకే నువ్వు తిరిగి సహాయం చెయ్యబూనుకుంటే అది 'ఇచ్చినమ్మ వాయినం, పుచ్చుకున్నమ్మ వాయినం' అవుతుంది. అప్పు తీర్చినట్లు అవుతుంది. రుణం తీరదు. అయినా ఈ రుణం తీర్చ వలసింది నాకు కాదు, ఈ ఆసుపత్రికి కాదు. సాటి మానవుడికి. ఈ సంఘానికి. నీకు సహాయం చేసిన ఈ సమాజ వ్యవస్థకి నువ్వు రుణం తీర్చక పోతే అది ఆ సమాజానికి వెన్నులో కత్తిపోటే అవుతుంది.''

సాటి మానవుడిని ఆపత్కాలంలో ఆదుకునే ఉదార బుద్ధి, ధాతృత్వం ఉన్న దాతలు ఇంకా అమెరికా గడ్డ మీద ఉండబట్టే ఈ దేశపు పౌరులని కర్మ యోగులని, ఈ దేశాన్ని కర్మ భూమి అనీ వివేకానందుడే కొనియాడేడన్న విషయం డాక్టర్ సుధాకర్‌కి తెలుసు.

(శాన్ డియాగో నగరంలో నిజంగా జరిగిన సంఘటనలని నేపథ్యంలో పెట్టుకుని అల్లిన కథ ఇది. నూ జెర్సీ నుండి వెలువడే తెలుగు జ్యోతి డిసెంబరు 1995 సంచికలో ప్రచురించబడింది.)

సి.పి. బ్రౌన్ స్మారక గ్రంథాలయం, కడప.
ప్రవేశ సంఖ్య ...............
Acc. No 24601.....
తేది. 29/7/12......